క్లుప్తంగా

వైఎస్సార్ బీమా సాయం అందజేత

బేతంచెర్ల: మండల పరిధిలోని వెంకటగిరి గ్రామానికి చెందిన ముచ్చు గోవిందు కుమారుడు చిన్న వెంకటస్వామి (32)ఈనెల 20వ తేదీన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ మేరకు గురువారం బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ. 10 వేల ను సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ కాశిరెడ్డి గంగాధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మురళీధర్ రెడ్డి, కుంచ రామతిమ్మారెడ్డి అందజేశారు.

ఉసేన్‌స్వామి దర్గాలో భక్తుల రద్దీ

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు గ్రామంలోవెలసిన ఉసేన్‌స్వామి దర్గాలో గురువారం భక్తుల రద్దీ నెలకొంది. ఉమ్మడి జిల్లాతోపాటు వైఎస్సార్ జిల్లాల నుంచి భక్తులు దర్గాకు తరలివచ్చారు. మొహర్రం ప్రభావంతో నెల రోజులుగా దర్గాకు ఎక్కువగా రాలేదు. ఆయా గ్రామాలకు చెందిన భక్తులు దర్గా చేరుకుని స్వామివారికి ఫాతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న కర్రా దంపతులు

కోవెలకుంట్ల: పట్టణంలోని బనగానపల్లె చౌరస్తా క్రాస్ రోడ్‌లో భక్తిశ్రద్ధలతో గురువారం నుంచి ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. అర్చకులు గోపూజ, గణపతిపూజ, పుణ్యాహవచనం, మాతృకాపూజ, పంచగవ్యమేళన, ప్రోక్షణ, ప్రాశన, రక్షాబంధనం, ప్రదోషకాలపూజ, అంకురార్పణ, దీక్షాహోమాలు తదితర కార్యక్రమాలు జరిపారు. ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో పూజ కార్యక్రమాలు కొనసాగాయి.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం




రోగులకు పరీక్షిస్తున్న డాక్టర్ సురేంద్రరాజు

కోవెలకుంట్ల: మండలంలోని కలుగొట్ల కాశీనాయన ఆశ్రమ ఆవరణలో గురువారం నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరం విజయవంతమైంది. హైదరాబాదుకు చెందిన హోమియోపతి వైద్యుడు అంబటి సురేంద్రరాజు ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంతోపాటు చుట్టుపక్కల పల్లెల ప్రజలు పెద్దఎత్తున శిబిరానికి వచ్చారు. బీపీ, షుగర్ తదితర దీర్ఘకాలిక వ్యాధులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

వ్యాసరచన, కవితల పోటీలు

బేతంచెర్ల: మాతృభాష వారోత్సవాలలో భాగంగా గురువారం ఏపీ మోడల్ స్కూల్లోని విద్యార్థులకు వ్యాసరచన, కవితల పోటీలు నిర్వహించారు. ప్రముఖ కవుల చిత్రపటాలను ప్రదర్శించారు. గిడుగు వెంకట రామూర్తి దగ్గర నుంచి వీరేశలింగం వరకు మాతృభాషకు ప్రాధాన్యత ఇచ్చారని,నన్నయ్య నుంచి మొదలైన సాహిత్యం పరవస్తు చిన్నయ్య వరకు ఎంతో శాఖోప శాఖలుగా విస్తరిల్లిందని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గుంగుల నాగరాజు వివరించారు.

పంట నమోదులో జియో ఫెన్సింగ్ విధానం



పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ అబ్దుల్ షఫీ

డోన్ టౌన్ : జియో ఫెన్సింగ్ విధానం ద్వారా రైతు సాగు చేసిన పొలం సరిహద్దులోనే పంట నమోదు చేయడం వలన అవకతవకలకు ఆస్కారం ఉండదని ఏఓ అబ్దుల్ షఫీ తెలిపారు. మండలంలోని గుమ్మకొండ, వెంకటాపురం రైతు భరోసా కేంద్రం పరిధిలో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ పంటలు సాగు చేసిన ప్రతి రైతుకు జియో ఫెన్సింగ్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు వెంకట్రాముడు, వీఆర్వో మాధవస్వామి, వీఆర్ఏ ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహం తనిఖీ

బనగానపల్లెరూరల్: పట్టణంలోని రవ్వలకొండపై ఉన్న ఏపీ మోడల్ స్కూల్ బాలికల వసతి గృహాన్ని గురువారం ఎస్ఎస్ఏ జిల్లా చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ నాగసువర్చల తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వంట, విద్యార్థినుల గదులతోపాటు స్టోర్, వాస్‌రూమ్‌లను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం ఆమె విద్యార్థినులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి విద్యార్థులకు కోసం ప్రత్యేకంగా హాస్టల్స్ ఏర్పాటు చేసి అన్ని రకాల వసతులు కల్పించడం జరిగిందన్నారు. పట్టుదల, క్రమశిక్షణతో చదివితే ఉన్నత ఫలితాలు సాధించడం సులువన్నారు. కార్యక్రమంలో వార్డెన్ పార్వతిదేవి, ప్రిన్సిపాల్ రామలక్ష్మీ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్యం.. పదిలం!

- వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు
- గ్రామీణులకు అందుబాటులో మెరుగైన వైద్యం
- పీహెచ్‌సీ స్థాయిలో 63 రకాల వైద్య పరీక్షలు
- అందరి మన్ననలు పొందుతున్న ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రియాంక (ఫైల్)



వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ శ్రీకాంత్ (ఫైల్)

సంజామల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్య, విద్య, వ్యవసాయ రంగాలకు అత్యధిక ప్రాధాన్యనిస్తుంది. ప్రత్యేకించి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. ఆరోగ్యశ్రీ పరిధిలోని పెంచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రామీణ స్థాయిలోనూ ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తీర్చిదిద్దారు. ఆధునిక వైద్యపరికరాలు, యంత్రాలు సమకూర్చడంతోపాటు వైద్యసిబ్బందిని నియామకాలు చేపట్టడంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. గత ప్రభుత్వహయంలో కేవలం 15 రకాల సేవలు అరకొరగా అందుతుండగా నేడు ప్రభుత్వ తీసుకున్న ప్రత్యేక చర్యలతో పీహెచ్‌సీలో 63 రకాల వైద్య సేవలు అందు బాటలోకి వచ్చాయి. అదేవిధంగా 108, 104 అంబులెన్స్ సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చాయి. ప్రత్యేకించి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ సేవలపై హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయి. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామానికి వైద్యుడితోపాటు సిబ్బంది వెళ్లి సాధారణ వైద్య పరీక్షలతోపాటు దీర్ఘకాలిక రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకు డాక్టర్ స్వయంగా వెళ్లి వైద్య పరీక్షలు చేస్తున్న తీరును ప్రతిఒక్కరూ అభినందిస్తున్నారు.

పీహెచ్‌సీలలో అందుతున్న వైద్య సేవలు...

పీహెచ్‌సీల్లో వైద్య సేవలు పూర్తిస్థాయిలో మెరుగుపడ్డాయి. దాదాపు 63 రకాల పరీక్షలు పీహెచ్‌సీలో చేస్తున్నారు. హెచ్‌బీ, ప్లేట్ కౌంటు, బ్లడ్ గ్రూపు,హెచ్ఐవీ, హెచ్‌సీఎస్టీ, వీడీఆర్ఎల్, గల్ల పరీక్ష, ర్యాండం బ్లడ్ షుగర్, యూరియా క్రియాటిన్, మలేరియా, డెంగీ, ఎస్‌జీపీటీ, ఎఎల్పీ, లిపిడ్ ప్రొఫైల్, సోడియం, పొటాషియం, క్లోరైడ్ యూరిన్, మైక్రోస్కోపింగ్ తదితర పరీక్షలు చేస్తున్నారు వైద్య సిబ్బంది. వైద్యశాలల్లో ఉచితగా పరీక్షలు చేయించికొని రోగ నిర్ధారణ తరువాత ఉచితంగా ఔషధాలు పొందుతున్నారు.

పీహెచ్‌సీల్లో పెరిగిన ఓపీ

మండల కేంద్రం సంజామలతోపాటు నొస్సం, ఆకుమల్ల, పేరుసోములలో పీహెచ్‌సీలు ఉన్నాయి. ఈ కేంద్రాలలో వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందుతున్న నేపథ్యంలో ఓపీల సంఖ్య పెరిగింది. గతంలో రోజుకు కేవలం 10 నుంచి15 మంది వరకు మాత్రం వచ్చేవారు. ప్రస్తుతం 50–60 వరకు వైద్య సేవల నిమిత్తం రోగులు వస్తున్నట్లు సమాచారం.

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం



ప్రభుత్వం పీహెచ్‌సీల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించడంతో మెరుగైన వైద్య సేవలు అందజేస్తున్నాం. పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. వైద్య పరీక్షలు కూడా అందుబాటులో ఉన్నాయి. రోగ నిర్ధారణ మేరకు చికిత్సతో పాటు ఉచితంగా మందులు కుడా అందిస్తున్నాం. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

–డాక్టర్ ప్రియాంక, మెడికల్ ఆఫీసర్1,నొస్సం, పీహెచ్‌సీ

వైద్యసేవలు సంతృప్తికరం



నొస్సం పీహెచ్‌సీలో అందుతున్న వైద్య సేవలు సంతృప్తికరంగా ఉన్నాయి. గతంలో ఆరోగ్యం బాగలే కపోతే జమ్మలమడుగు, కొవెలకుంట్ల ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఇక్కడి పీహెచ్‌సీలో వైద్యులు మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ఉచితంగా పరీక్షలు కూడా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించడం అభినందనీయం.

– సి.క్రిష్ణయ్య, నొస్సం

పేదల ఆరోగ్యానికి ప్రాధాన్యత



జగనన్న ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తుందనడంలో ఏ మాత్రం సందేహం లేదు. పీహెచ్‌సీకి మెరుగైన వైద్య పరికరాలు అందుబాటులోకి రావడంతో వైద్య పరీక్షలు అందుతున్నాయి. ఉచితంగా వైద్యం, మందులు అందుతున్నాయి. ఇప్పుడు పట్టణాలలో ఉన్న ప్రైవేట్ హాస్పిటళ్లకు వెళ్లాల్సిన అవసరం తప్పింది. ఇళ్ల వద్దకు వచ్చి వైద్య సేవలు అందజేయడం సంతోషకరం.

– వెంకట రాముడు, నొస్సం

నేడు మద్దిలేటయ్య ఆలయంలో వరలక్ష్మీ వ్రతం

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం శివారులో వెలసిన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్నట్లు ఈఓ పాండురంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు తెలిపారు. లోక కళ్యాణార్థం అమ్మవారి అనుగ్రహంతో నిర్వహించే సామూహిక వరలక్ష్మీ వ్రతానికి మహిళలు తరలివచ్చి ఆశీర్వాదం పొందాలని కోరారు. భక్తుల సౌకర్యార్థం ఆర్ఎస్ రంగాపురం నుంచి ఆలయం వరకు ఉచితంగా ఆటో సౌకర్యం కల్పించినట్లు వారు తెలిపారు.

నేడు ప్రత్యేక ఆధార్ క్యాంప్

సంజామల: మండల పరిధిలో గిద్దలూరు, ఆర్ లింగందిన్నె గ్రామాల సచివాలయంలో శుక్రవారం ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగకుమార్ గురువారం తెలిపారు. ప్రత్యేక క్యాంపులో కొత్తగా ఆధార్ నమోదు, మార్పులు, చేర్పులు సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఒక్కరోజు జరిగే ప్రత్యేక ఆధార్ క్యాంప్‌ను ఆయా గ్రామాల సచివాలయ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కోవెలకుంట్ల సీఐ బదిలీ

కోవెలకుంట్ల: పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న నారాయణరెడ్డిని బదిలీచేస్తూ పోలీస్‌శాఖ ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఒకేచోట రెండు సంవత్సరాలకుపైగా విధులు నిర్వర్తిస్తున్న పోలీసు అధికారులను బదిలీ చేసే ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో కోవెలకుంట్ల సీఐగా నారాయణరెడ్డి రెండు సంవత్సరాలు పైబడి విధులు నిర్వర్తిస్తున్న నేపథ్యంలో అనంతపురం జిల్లాకు బదిలీ చేశారు. ఆ స్థానంలో ఇంకా ఎవరిని నియమించలేదు.

బడి బయట పిల్లలకు ఓపెన్ స్కూల్‌లో విద్య



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : బడి మానేసి బయట ఉన్న పిల్లలు ఓపెన్ స్కూల్‌లో విద్యనభ్యశించాలని మండల విద్యాధికారి ప్రభాకర్ సూచించారు. బడి బయట ఉన్న పిల్లలను ఓపెన్ స్కూల్లో చేర్పించాలంటూ గురువారం పట్టణంలోని కొత్తపేట జెడ్పీ హైస్కూల్ నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనివార్య కారణాల వలన చదువు మధ్యలో వదిలేసిన వారికి దూరవిద్య ద్వారా మళ్లీ విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దూర విద్య కో ఆర్డినేటర్ రామనర్సప్ప, ఉపాధ్యాయులు ప్రకాష్‌రెడ్డి, గంగిరెడ్డి, మాణిక్యంశెట్టి, చంద్రుడు, సుధాకర్, నారాయణ, శ్రీనివాసులు, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు కృతనిశ్చయంతో విధులు నిర్వర్తించాలి

- జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని, అందుకుతగ్గట్లుగానే అధికారులు కృతనిశ్చయంతో విధులు నిర్వహించి గ్రామాల అభివృద్ధికి దోహదపడాలని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ కారపాకుల నాగవేణి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి జెడ్పీ చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతు గతంలో ఏ ప్రభుత్వం చేయని రీతిలో పేదలకు విలువైన ఇంటి స్థలంతో పాటు రోడ్లు,విద్యుత్,నీటి సౌకర్యం కల్పిస్తుందన్నారు. మండలంలో భవిష్యత్‌లో సైతం మంచినీటి సమస్య ఉత్పన్నం కాకూడదనే సదుద్దేశంతో జల్‌జీవన్ మిషన్ పథకం కింద రెండు విడతల్లో రూ.20 కోట్లు నిధులు మంజూరు చేయించామన్నారు. అన్ని గ్రామాల్లో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. సీసీరోడ్లు, గ్రామ సచివాలయాలకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌పై పీఆర్ ఏఈ అన్వర్ హుశేన్ తీరుపై జెడ్పీ చైర్మన్ అసహనం వ్యక్తం చేశారు.

సభ దృష్టికి సమస్యలు

సభ్యులు వివిధ సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఓ తహసీల్దార్ టీడీపీ నాయకులకు అసైన్‌మెంట్ కమిటీ లేకుండానే వందల ఎకరాలు రాసిచ్చారని మీర్జాపురం సర్పంచ్ లాయర్ మహేశ్వరరెడ్డి ఆరోపించారు. కోటపాడులో 53 ఎకరాలు భూమి సిమెంట్ ఫ్యాక్టరీ లీజులో ఉన్నప్పటికీ ఆ భూమిని సబ్‌డివిజన్ చేసి పట్టాలు ఇచ్చి ఆన్‌లైన్‌లో నమోదు చేశారన్నారు. అసైన్‌మెంట్ కమిటీ లేకుండానే భూములు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఆ భూములను రద్దు చేసి పేదలకు పంపిణీ చేయాలని కోరారు. ఏపీఓ గంగన్న ఎంపీటీసీ సభ్యులకు ఎలాంటి సమచారం ఇవ్వకుండా అవమానపరుస్తున్నారని గొర్విమానుపల్లె ఎంపీటీసీ పులిప్రకాష్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రొట్ కాల్ పాటించడం లేదని, మండల మీట్‌కు మాత్రమే మేము పనికొస్తామా అని అధికారులను నిలదీశారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించడం లేదని బిఉప్పులూరు ఎంపీటీసీ సభ్యుడు క్రిష్టారెడ్డి,మండల కో–ఆప్షన్ సభ్యుడు సలీంబాష ఎంఈఓ అబ్దుల్ కలాం దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఎంపీడీపీ ప్రసాద్‌రెడ్డి, హౌసింగ్ డీఈ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్ రెడ్డి

సంజామల: రైతులు గొర్రెల పెంపకంలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి మంచి లాభాలు పొందాలని ప్యాపిలి గొర్రెల పెంపకందారుల శిక్షణ కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి సూచించారు. మండల కేంద్రం సంజామలలోని ఏరియా పశువు వైద్యశాలలో ఏడీ మోహన్ రావు అధ్యక్షతన గురువారం సన్న జీవాల పెంపకంలో మేలైన యాజమాన్య పద్ధతుల అవగాహన సదస్సు నిర్వహించారు. అసిస్టెంట్ డైరక్టర్ మాట్లడుతూ గొర్రెల కాపరులు లాభదాయకమైన గొర్రెల పెంపకం చేపట్టాలని, మందలో జాతి లక్షణాలు కలిగిన విత్తనపు పొట్టేలు ఉండేలా చూసుకోవాలన్నారు. వ్యాధి బారిన పడిన జీవాలను మంద నుండి వేరు చేసి చికిత్స అందించడం ద్వారా గొర్రెల మరణాల శాతం తగ్గించవచ్చని సూచించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు డాక్టర్లు శ్రీనువాసులు, రమేష్, రఘు బాలకృష్ణ, శివనంద, గోపాల మిత్రసిబ్బంది పాల్గొన్నారు.

నేడు అనంతపురంలో మెగా జాబ్ మేళా

డోన్ టౌన్ : అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలలో ఏపీ కళాశాలల విద్యా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ భారతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసుకున్న అన్ని గ్రూపులకు సంబధించిన విద్యార్థులకు ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ జాబ్ మేళాకు 42 కంపెనీల ప్రతినిధులు హాజరై ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. ఆసక్తి అభ్యర్థులు ఓరిజినల్ సర్టిఫికెట్లతో పాటు బయోడేటాతో హాజరు కావాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : జగదుర్తి సబ్ స్టేషన్ పరిధిలోని రూరల్ ఫీడర్ 11 కేవీ విద్యుత్ లైన్ పనులు జరుగుతున్నందున శుక్రవారం జగదుర్తి, ఉడుముల పాడు, గుంటుపల్లె, సోంపురం, తాటిమాను కొత్తూరు, అముకదాడు గ్రామలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 12 నుంచి సాయంత్రం 6గంటల వరకు కరెంటు ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు. అదేవిధంగా వ్యవసాయానికి వేకువజామున 3 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఇవ్వనున్నట్లు తెలిపారు.

పంట నమోదు తప్పనిసరి



కైప గ్రామంలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న మోహన్‌రావు

బనగానపల్లె: సాగు చేసిన పంటల నమోదును రైతులు తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు సూచించారు. మండలంలోని కైప, చిన్నరాజుపాళెం, పసుపల గ్రామాల్లో సాగు చేసిన పంటలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే పంటనష్ట పరిహారంతో పాటు ఇతర రాయితీలు వర్తిస్తాయన్నారు. అనంతరం పసుపల గ్రామంలోని ఆర్‌బీకేను సందర్శించి ఎరువుల నిల్వలను పరిశీలించారు. రైతులకు ఇబ్బందులులేకుండా ఎరువులను సరఫరా చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి, టెక్నికల్ ఏఓ అయూబ్‌బాషా రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ బుకింగ్ పరిశీలన

ప్యాపిలి: మండల పరిధిలోని మాధవరం గ్రామంలో జరుగుతున్న ఈ క్రాప్ బుకింగ్ ప్రక్రియను గురువారం జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి పంటకు తప్పనిసరిగా ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం జరిగితే ప్రభుత్వం పరిహారం అందిస్తుందన్నారు. అలాగే పంటలకు బీమా కూడా వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి రాజేశ్, ఆర్బీకే సిబ్బంది రాజేశ్, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

పొలం బావులను పూడుస్తున్న వ్యక్తులపై కేసు నమోదు

సంజామల: మండలంలోని ఆకుమల్ల గ్రామానికి చెందిన ఉయ్యాలవాడ ఇమాంసా పొలంలోకి అక్రమంగా ప్రవేశించి దౌర్జన్యంగా రెండు బావులను పూడ్చిన వ్యక్తులపై గురువారం కేసు నమోదు చేశామని ఎస్ఐ ప్రతాప్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉయ్యాలవాడ ఇమాంసా పొలంలోకి అదే గ్రామానికి చెందిన నూలి కొండయ్య, నూలిటీకు ఆనంద్, నూలి శేఖర్, నూలి ప్రియరాజు అక్రమంగా ప్రవేశించి పొలంలోని బావులను పూడుస్తున్నారు. బావులను ఎందుకు పూడుస్తూన్నరని ప్రశ్నించగా ఈ పొలం మాది అంటూ నిందితులు బెదిరించారని ఎస్ఐ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

చంద్రయాన్–3 టీంలో ప్యాపిలి యువకుడు



సైంటిస్టు ఇల్లూరు లలిత్ కుమార్

ప్యాపిలి: భారత దేశం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్ –3 విజయం వెనుక ఎందరో శాస్త్రవేత్తల కృషి దాగి ఉంది. నంద్యాల జిల్లా ప్యాపిలి పట్టణానికి చెందిన ఇల్లూరు గురు లలిత్ కుమార్ కూడా ఇస్రోలో పని చేస్తున్నాడు. దీంతో చంద్రయాన్ కోసం పని చేసే అరుదైన ఘనత తనకు దక్కిందని ఆనందం వ్యక్తం చేస్తున్నాడు. ప్యాపిలికి చెందిన గురుప్రసాద్, ప్రసన్నలక్ష్మిల కుమారుడు గురు లలిత్ కుమార్ ప్రాథమిక విద్య ప్యాపిలిలో, ఉన్నత విద్య కర్నూలులో చదివాడు. ఇంటర్ హైదరాబాదు, బీటెక్ చెన్నైలో పూర్తి చేశాడు. అనంతరం రైల్వే శాఖలో ఉద్యోగం చేస్తుండగా 2020లో ఇస్రోలో ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నాడు. ఆ విధంగా సైంటిస్టుగా ఎంపికై శ్రీహరి కోటలో తన సేవలు అందిస్తున్నాడు. ప్రతిష్టాత్మకమైన చంద్రయాన్ 3 స్పేస్ క్రాఫ్ట్ రూపొందించిన టీంలో గురు లలిత్ కుమార్ పని చేశాడు. పట్టణ ప్రజలు సైంటిస్టు గురు లలిత్ కుమార్‌ను అభినందిస్తున్నారు.

క్రైం కార్నర్

వ్యక్తి ఆత్మహత్య

డోన్ టౌన్ : పట్టణంలోని చిగురమానుపేటలో నివాసం ఉంటున్న షేక్ అబ్దుల్లా(30) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పట్టణ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఓబులేసు తెలిపారు. మృతుడు తాగుడుకు బానిసై ఆరోగ్యం దెబ్బతినడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసిందన్నారు. మద్యానికి డబ్బులు కావాలని తరచూ భార్య భర్తల మధ్య గొడవలు జరుగుతుండేవన్నారు. గురువారం గొడవ పడి భార్య మోహరాజ్ ఇంటి బయట బట్టలు ఉతుకుతుండగా ఇంట్లోకి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. ఈ మేరకు విచారణ చేస్తున్నామని తెలిపారు.

రాజీ కావడం లేదని దాడి

డోన్ టౌన్ : గతంలో జరిగిన ఓ కేసు విషయంలో రాజీ కావడం లేదని గొల్ల మహేంద్రబాబుపై ఓబులేసు, వెంకట్రాముడు, మల్లికార్జునలు దాడి చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన మహేంద్రబాబు గురువారం పట్టణ సమీపంలోని నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి సమీపంలో ఉండగా అదే గ్రామానికి చెందిన ముద్దాయిలు దాడి చేసి గాయపరచారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

చీటింగ్ కేసు నమోదు

బనగానపల్లె: హైదరాబాద్‌కు చెందిన ఉపేంద్ర, గౌతంపై చీటంగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి గురువారం తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు ఈ నెల 20 సికింద్రబాద్‌లో మణికంఠనాయుడు రైల్వే పరీక్ష రాసేందుకు వెళ్లాడు. అక్కడే ఉన్న హైదరాబాద్‌కు చెందిన ఉపేంద్ర, గౌతం మణికంఠనాయుడిని పరిచయడం చేసుకుని మాయమాటలు చెప్పి డబ్బులు ఇస్తే ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించారు. దీంతో మణికంఠ నాయుడు వారికి రెండుసార్లు మొత్తం రూ.8లక్షల వరకు చెల్లించాడు. అయినా ఉద్యోగం రాలేదు. ఈ విషయంపై ఉపేంద్ర, గౌతంను పలుమార్లు ప్రశ్నించినా స్పందనలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నలుగురు సారా విక్రేతలకు రిమాండ్

డోన్ టౌన్ : పట్టణంలోని శ్రీనివాసనగర్‌కు చెందిన ఈడిగ తిమ్మనాయుడుతో పాటు కోట్ల సుజాతమ్మ నగర్‌కు చెందిన బోయ సురేష్, షేక్ బాబా పక్రుద్దీన్ నాటు సారా తరలిస్తుండగా దాడి చేసి అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆటోలో నాటు సారా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి వారిని అదుపులోకి తీసుకుని 25లీటర్ల, ఆటో స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ తెలిపారు. మండల పరిధిలోని లక్కుంపల్లెలో నాటు సారా విక్రయిస్తున్న ఎరుకలి సుంకన్నను అదుపులోకి తీసుకుని, ఏడు లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ పోలీసు స్టేషన్ ఎస్ఐ సుధాకర్ రెడ్డి గురువారం తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినీలు

కోవెలకుంట్ల: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గీతాలక్ష్మి తెలిపారు. గురువారం కోవెలకుంట్ల పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు బాల్య వివాహాల మూలంగా జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులకు అవగాహన లేకపోవడంతోనే చిన్నతనంలోనే వివాహాలు చేస్తున్నారన్నారు. బాలికలకు 18 సంవత్సరాలు, మగపిల్లలకు 21 సంవత్సరాలు పూర్తి అయిన తర్వా వివాహాలు చేయడం అన్ని విధాలా శ్రేయస్కరమన్నారు. సీనియర్ న్యాయవాది నరసింహులు మాట్లాడుతూ బాల్య వివాహాలు జరిపిస్తే రెండు సంవత్సరాల జైలు శిక్ష, రూ. 2 లక్షల జరిమానా విధిస్తారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం అరుణకుమారి, చంద్రమ్మ, ఉపాధ్యాయినీలు కృష్ణవేణి, విజయలక్ష్మి, వందన, ఇందుమతి, ధరణిదేవి, అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

సంజామల: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఎంపీడీఓ నాగకుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంత అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని గురువారం వారు ప్రారంభించి మాట్లాడారు. బాల్య వివాహాల మూలంగా జరిగే అనార్థాలను వారు వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల పరిపాలన అధికారి విజయకుమార్ రెడ్డి, కేజీబీవీ ప్రిన్సిపాల్ శ్రీలేఖ, హెడ్ కానిస్టేబుల్ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనల ఫలితమే చంద్రయాన్ విజయవంతం



జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

డోన్ టౌన్ : శాస్త్రవేత్తల అనేక పరిశోధనల ఫలితమే చంద్రయాన్–3 విజయవంతం అయ్యిందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ భారతి, పాతపేట హైస్కూల్ హెచ్ఎం పద్మావతి అన్నారు. గురువారం విద్యా సంస్థల్లో చంద్రయాన్ –3 విజయోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. వారు మాట్లాడుతూ యావత్ భారతదేశం గర్వించ దగ్గ రోజు ఆగష్టు 23 అన్నారు. అదేవిధంగా పాతపేట హైస్కూల్ విద్యార్థులు జాతీయ జెండాలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక పాత బస్టాండ్‌లో ఇస్రో పేరు మీద తయారు చేసిన కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఆయా కార్యక్రమంలో డిగ్రీ కళాశాల అధ్యాపకులు వీరీచారి, లోకేరాజు, స్వరూపరాణి, లలితుమారి, పాండురంగ, లక్ష్మయ్య, హైస్కూల్ ఉపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి, శివప్రసాద్, వెంకటరమణ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లెరూరల్: చంద్రయాన్–3 విజవంతం భారతీయలందరికి గర్వకారణమని రసాయణ శాస్త్ర అధ్యాపకులు ఉమామహేశ్వరరెడ్డి అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో విజయోత్సవ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం వెనుక ఎంతో మంది ఇస్రో శాస్త్రవేత్తల కృషి ఉందన్నారు. అధ్యాపకులు మహమ్మద్‌గౌస్, సుధాకర్‌రెడ్డి, కౌసల్యాదేవి, రవికుమార్ పాల్గొన్నారు.

హెచ్ఐవీ రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

కోవెలకుంట్ల: హెచ్ఐవీ/ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రిన్సిపాల్ రామసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్‌క్లబ్ ఆధ్వర్యంలో హెచ్ఐవీపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీపై చాలా మందికి కనీస అవగహన లేదన్నారు. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవగాహన కలిప్పించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. కార్యక్రమంలో న్యాక్ సమన్వయకర్త భాస్కర్‌రెడ్డి, అధ్యాపకులు కృష్ణశశాంక, నాగేశ్వరరెడ్డి, రాజు, కృష్ణదాసు, అన్నపూర్ణ, నరేంద్రనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.